పదిలమైన ఫలితాలు సాధ్యమేనా?

- పని ఒత్తిడిలో ఉపాధ్యాయుల చిత్తు
- పెరిగిన యాప్‌లతో చదవులు అంతంత మాత్రం
- ఫలితాలు ఎలా ఉంటాయోనని తల్లిదండ్రుల ఆందోళన


పరీక్షలు రాసేందుకు బారులు తీరిన విద్యార్థులు (ఫైల్)

ఉండి : ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నా ముఖ్యంగా ఉపాధ్యాయులు పని ఒత్తిడితో చిత్తవుతున్నారు. విద్యాశాఖలో ఉన్నతాధికారులు తలో మాట తలో ప్రణాళికతో ముందుకు రావడం వాటిని ప్రభుత్వ ఉపాధ్యాయులపై రుద్దడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆయా అధికారులు తమ ప్రణాళికలే పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశాలివ్వడం తనిఖీలు చేయడంతో మరింత ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు మరికొద్ది రోజుల్లోనే పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా ఈ ఏడాది ఏ విధంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఎవరి ప్రణాళిక ప్రకారం జరుగుతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు.

అధికమైన యాప్‌లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాప్‌లతో ఏగలేకపోతున్నామని వాటిని తీసేయాలని ఆందోళనలు చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు మరింత ఒత్తిడి పెరిగింది. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే యాప్‌లను తొలగిస్తామని హామీలు గుప్పించిన నాయకులు అధికారంలోకి రాగానే యాప్‌ల సంఖ్యను మరింతగా పెంచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడు లేదా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లలో ఉపాధ్యాయులు వివరాలు నమోదు చేసేవారు. కాని ప్రస్తుతం ఆ సంఖ్య ఏడుకు పెరిగింది. దీంతో ఒకవైపు యాప్‌లలో సమాచారం అప్‌లోడ్ చేయలేక మరో వైపు విద్యార్థులకు పాఠశాలు చెప్పలేక ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో గత ఏది పదో తరగతి పరీక్షా ఫలితాల కంటే ఈ ఏడాది ఫలితాలు తగ్గే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

అమ్మఒడి ఎగనామం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి రూ.15 వేలతోపాటు పలు పథకాలు, విద్యార్థులకు పూర్తి స్థాయి విద్యా సామగ్రితో కిట్లు అందజేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంత మంది చదువుకునే విద్యార్థులు ఉంటే అందరికీ ఏటా రూ.15 వేల చొప్పున అందజేస్తామని ఊకదంపడు వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు చేతులెత్తేశారు. ఈ ఏడాది అమ్మ ఒడి ఇచ్చేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులేదంటూ నిస్సిగ్గుగా ప్రకటించారు. విద్యార్థులకు కావలసిన పౌష్టికాహారం, ప్రత్యేక తరగతులకు ట్రావెలింగ్, స్టడీ మెటీరియల్ వంటివి కొనుగోలు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో విద్యార్థులు ఈ ఏడాది మరింతగా ఇబ్బందుల పాలవుతున్నారు. ఇదంతా కూటమి ప్రభుత్వం మోసమేనని పలువురు వాపోతున్నారు.

విద్యా వ్యవస్థను మోసగించారు



కార్పొరేట్ పాఠశాలల్లో లేని సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను అద్భుతంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతుంది. దీంతో ప్రయోజనమేమీ కనిపించడం లేదు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఫలితాలపై ఆందోళన చెందుతున్నారు.

– శేషాద్రి శ్రీను, ఉండి

అమ్మ ఒడి ఎందుకు ఆపారు ?



విద్యార్థుల భవితవ్యానికి అమ్మ ఒడి ఎంతో సహకరించేది. ప్రతి ఏటా చెప్పిన సమయానికి అమ్మ ఒడి నగదు రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి నేరుగా వేసేవారు. కానీ ఇప్పుడు నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అని చెప్పి విద్యార్థులను, తల్లిదండ్రులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. దీని వల్ల ఎంతో మంది విద్యార్థులు చదవులో వెనుకబడిపోతున్నారు.

– అంగర రాంబాబు, ఉండి

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు


బలుసుమూడిలో శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి స్పందన

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణం బలుసుమూడి, బీసీ కాలనీలో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని తొలగించేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శనివారం సాక్షిలో వచ్చిన వార్త అధికారులను కదిలించింది. మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి స్పందించి శానిటేషన్ అధికారుల ఆదేశించడంతో దిరుసుమర్రు, వెంప, యనమదుర్రు, కొత్తపూసలమర్రు, గొల్లవానితిప్ప, తాడేరు, కొమ రాడ తదితర 25 గ్రామాల్లో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేసి బ్లిచింగ్ పౌడర్ జల్లించారు.. దీనిపై స్థానికులు సాక్షి పత్రిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.


బీసీ కాలనీలో చెత్త చెదారం తొలగించిన దృశ్యం

క్లుప్తంగా

శివారెడ్డికి యూటీఎఫ్ నాయకుల సత్కారం

కాళ్ల: ఎంఐఎస్ కోఆర్డినేటర్ బి.శివారెడ్డిని యూటీఎఫ్ కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కాళ్ల మండలంలో సుమారు ఎనిమిదేళ్లు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విశేష కృషి చేసి బదిలీపై గుంటూరు వెళుతున్న సందర్భంగా సత్కారం నిర్వహించినట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జి.రామకృష్ణంరాజు, వి.రవికుమార్‌రాజు, బీఆర్‌ఎంకే స్వామి, పి.ప్రభుదాసు, ఎల్.అప్పలాచార్యులు, ఎంఎన్‌సీహెచ్‌ఎస్ వర్మ పాల్గొన్నారు.

ఘంటసాల పాటలు సుమధుర గీతాలు


భీమవరంలో ఘంటసాల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: తెలుగువారికి వరం ఘంటసాల అమృతగానమని ఆయన పాటలు సుమధుర గీతాలని అఖిలభారత శోభన్‌బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, భూపతిరాజు బుజ్జిరాజు అన్నారు. మంగళవారం ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతి సందర్భంగా జువ్వలపాలెం రోడ్డులోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన సుమధుర గానంతో ప్రేక్షకులను రంజింపచేసిన అలనాటి గాయకుడు ఘంటసాల అన్నారు.

విజయలక్ష్మిగా మావుళ్లమ్మ


విజయలక్ష్మి అలంకరణలో శ్రీమావుళ్లమ్మ అమ్మవారు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని విజయలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మవారికి సూళ్లురుపేటకు చెందిన ఐ.చంద్రమతి దంపతులు 15 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి


జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: హలో నాయి బ్రాహ్మణ ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను త్వరితగతిని అమలు చేయాలని, నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఇచ్చిన జీవోలను వెంటనే అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ పసుమర్తి శ్రీనివాస్, వేపాడ పెద్దిరాజు, చీపురుపల్లి దేవా, కట్టుంగ నరేష్, పాలవలస గోపి, క్రొవ్విడి రత్నంరాజు, తగరంపూడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమిషన్ పొడిగింపు అభినందనీయం

భీమవరం: మూడేళ్లపాటు సఫాయి కర్మచారి కమిషన్ కాలపరిమితిని పొడిగిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య అన్నారు. భీమవరంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో భీమవరం ఆర్డీవో కె. ప్రవీణ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా సత్కరించచారు. ఈ కార్యక్రమంలో భీమవరం, వీరవారం తహసీల్దార్లు ఆర్ రాంబాబు, ఏవీ రామాంజనేయులు, వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాడుగుల దుర్గాప్రసాద్, అడపా బాలాజీ, మాడుగుల లక్ష్మి, పొట్లూరు పద్మ పాల్గొన్నారు.

ఆక్వా రైతులు నిబంధనలు పాటించాలి


మురుగు కాలువ గట్టును తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాళ్ల: ఆక్వా చెరువుల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని డ్రైనేజీ ఏఈ జయప్రకాష్, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ ఇందిరాప్రియదర్శిని హెచ్చరించారు. కాళ్ల మండలం కోపల్లె గ్రామం పరిధిలో బొండాడ మురుగు డ్రెయిన్ గట్టును ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చెరువులను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. బొండాడ మురుగు డ్రెయిన్ ఆనుకుని ఉన్న ఆక్వా చెరువుల రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి వచ్చామన్నారు. ఈ సందర్భంగా మురుగు కాలువగట్టు ఆక్రమించి తవ్వటమే కాకుండా మట్టిని సైతం తరలించినట్లు వారు గుర్తించామన్నారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలువగట్టుకు మూడు మీటర్లు వదిలి చెరువుకు గట్టు వేసుకోవాలని మురుగు కాలువ గట్టునే ఆక్రమించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా సరిహద్దు రాళ్లను సైతం మార్చి మురుగు కాలువ గట్టుపై పాతడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన రైతుకు నోటీసులు జారీ చేస్తామని, అప్పటి వరకు చెరువులో నీరు నింపకూడదని, ఒక వేళ తాము అందించిన నోటీసులను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో హుస్సేన్, డ్రైనేజీ, మత్స్యశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి


భీమవరంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కాలుష్య కారణమైన ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలంతా సహకరించాలని భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య అన్నారు. మంగళవారం భీమవరం మునిసిపాల్టీ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీసూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని వివిధ రకాల వ్యాపారస్తులు ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వినియోగించరాదని నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవన్నారు. కళాశాల కరస్పాండెంట్ నూకల గురునాయుడు, ప్రిన్సిపల్ రూపా సూర్యలక్ష్మి, చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంవల్ల ఏర్పడే అనర్థాలు విద్యార్థులు గ్రహించి తద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

స్త్రీ మూర్తిని రక్షించుకుందాం..


ఆకివీడు: సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ సుజాతారాణి


పాలకోడేరు: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో వాణీ విజయరత్నం

ఆకివీడు: మానవ జాతి మనుగడకు స్త్రీ మూర్తిని రక్షించుకోవలసిన బాధ్యత మనపై ఉందని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ టి.సుజాతారాణి అన్నారు. బేటీ బఛావో, బేటీ పఢావో రెండో దశ కార్యక్రమాన్ని స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.బాల్య వివాహాలు వద్దు–బాలికల చదువే ముద్దు, చిన్న వయస్సులో పెళ్లి చట్టరీత్యా నేరం, బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం, ఆడపిల్ల చదువు అవనికే వెలుగు అంటూ విద్యార్థినులు నినాదాలు చేస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆకివీడు ప్రాజెక్టు అధికారిణి వాణీ విజయరత్నం మాట్లాడుతూ భ్రూణ హత్యల్ని తల్లులే అరికట్టాలన్నారు. అటువంటివాటిపై తక్షణం అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రత్నకుమారి, కేవీఎస్ లక్ష్మి, ఈఓ సుజాతా లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భేటీ బచావో–భేటీ పఢావోపై అవగాహన

పాలకోడేరు: భేటీ బచావో–భేటీ పఢావో అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వాణీవిజయరత్నం ఆధ్వర్యంలో అవగాహన, విద్యార్థినులచే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో వాణీవిజయరత్నం మాట్లాడుతూ అనాదిగా ఆడపిల్లలను చిన్న చూపు చూస్తున్నారని ఆధునిక సమాజంలో ఆడపిల్లల భవిష్యత్తు రూపు రేఖలు మార్చాలంటే చదివించాలన్నారు. మహేష్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పార్వతి, సూర్య కుమారి, అంగన్‌వాడీ టీచర్లు విమల, శాంత కుమారి, రమణ, జ్యోతి, ధనలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల బిగింపు


దళితులతో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్

ఆకివీడు: స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని మంచి నీటి చెరువు గట్టు వద్ద ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న దళితుల ఇళ్లు తొలగిస్తూ, విద్యుత్ మీటర్లు తొలగించడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. పోరాటాల ఫలితంగా దళితుల ఇళ్ల తొలగింపును కోర్టు నిలుపుదల చేసిందని, వెంటనే ఆయా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించడంతో మంగళవారం కనెక్షన్లు ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆక్రమణదారులకు అండగా నిలిచి, అధికారుల చర్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. పుష్పరాజ్ మాట్లాడుతూ అధికారులు దళితులపై దాడులు ఆపి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, నల్లి రాజేష్, జిల్లా కార్యదర్శి గడ్డం అబ్రహం, చిల్లి రాజ్‌కుమార్, కేదాస్ నాగరాజు, సూరిబాబు పాల్గొన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

భీమవరం అర్బన్: ఈ నెల 14న భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మురళీ గంగాధరరావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11.30 లకు ప్రారంభమవుతుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరై అజెండాలోని అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి చొరవ చూపాలి

భీమవరం (ప్రకాశంచౌక్): భూ సంబంధిత కోర్టు కేసులు, తగదాలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ జాయింటు కలెక్టరు చాంబర్ నందు జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు, మండల తహసీల్దార్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అమరావతి ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్ ఉన్న భూ సంబంధిత కోర్టు కేసులు, భూ సంబంధిత తగదాలు, తదితర కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా అధికారులు ప్రత్యేక పెట్టాలన్నారు. అన్ని పెండింగు కేసులపై కౌంటర్లను ఎప్పటికప్పుడు దాఖలు చేసి, కేసులు పరిష్కారాన్నికి కృషి చేయాలన్నారు. గూగుల్ మీట్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో వారి కార్యాలయం నుంచి పాల్గొన్నారు.

వెనక్కి వచ్చిన జీతం బిల్లు

ఆకివీడు: మండలంలోని చినకాపవరం గ్రామ సచివాలయ సిబ్బందికి జనవరి జీతాల బిల్లు వెనక్కి రావడంతో ఈ నెల జీతం రానట్టేనని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు నెలల జీతాలు సకాలంలో రాక ఎరియర్లుగా తీసుకోవలసి వచ్చిందని వారు వాపోయారు. డీడీఓ నిర్లక్ష్యంగా లాగిన్ చేయడం వల్లే బిల్లు వెనక్కి వచ్చిందని సచివాలయ సిబ్బంది తెలిపారు. డీడీఓ జీతాల బిల్లులు సకాలంలో పంపడం లేదని, సాంకేతిక లోపాలుండటం వలన అవి తిరిగి వచ్చిన తరువాత, మళ్లీ పంపేందుకు గడువు ముగుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బందికి జనవరి జీతాలు జమ కాలేదు. దీనిపై డీడీఓ ప్రసాద్‌ను వివరణ కోరగా సాంకేతిక లోపం వల్ల చినకాపవరం సచివాలయ సిబ్బంది జీతాల బిల్లు తిరిగి వచ్చిందని చెప్పారు. దీనిపై ఎంపీడీఓ సుహాసినిని వివరణ కోరగా జీతాల బిల్లు ప్రతి నెలా 26 లోపు డీడీఓలు లాగిన్‌లో ప్రభుత్వానికి పంపుతారన్నారు. చినకాపవరం సచివాలయ బిల్లు సాంకేతిక లోపంతో తిరిగొచ్చిందన్నారు. దీనిపై విచారణ చేస్తానని తెలిపారు.

హ్యాకథాన్‌లో విద్యార్థుల ప్రతిభ


భీమవరంలో విష్ణు కళాశాలలో విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించిన సైకి క్వెస్ట్ 2.0 హ్యాకథాన్ పోటీల్లో భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నారని ప్రిన్సిపల్ మంగం వేణు చెప్పారు. బహుమతులు గెల్చుకున్న విద్యార్థులను మంగళవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా వివరాలను విలేకర్లకు తెలిపారు. డిజైన్ ఆన్ అటానమస్ పేలోడ్ (1 కేజీ) –డ్రాపింగ్ సిస్టమ్ విత్ ఏ పారాచూట్ కెన్ బీ మౌంటెడ్ ఆన్ టో థేయిర్ డ్రోన్స్ అనే అంశంలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు గెల్చుకోగా విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఏఐ అటానమస్ హ్యాకథాన్ పోటీల్లో ×సోయరింగ్ ఇంటలిజెన్స్ రివొల్యూషనోజ్ డ్రోన్స్ విత్ ఏఐ అనే అంశానికి ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు నగదు బహుమతి సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపల్ వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీ లక్ష్మి, కె శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

భీమవరం: వ్యక్తిత్వ వికాసం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, కెరీర్ గైడెన్స్ , టైం మేనేజ్మెంట్ వంటివి పెంపొందుతాయని వ్యక్తిత్వ వికాస నిపుణునుడు ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అపజయాలను విజయంగా మార్చుకొని విజేతలు కావాలంటే వ్యక్తిత్వ వికాసం ఎంతైనా అవసరమన్నారు. జీవితంలో ఏ రంగంలోనైనా ముందుకు సాగాలంటే క్రమశిక్షణ చాలా ముఖ్యమని స్వీయ క్రమశిక్షణతో వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం అంజాన్‌కుమార్, యాంటీ ర్యాగింగ్ కమిటీ కోఆర్డినేటర్ జిజి రత్నం పాల్గొన్నారు.

అచ్యుత రామ సిద్ధాంతికి గౌరవ డాక్టరేట్


అచ్యుత రామ సిద్ధాంతి

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరుకు చెందిన పురోహితులు దర్భా శివలింగమూర్తి కుమారుడు అచ్యుత రామ సిద్ధాంతి జ్యోతిష్య సంస్కృత ఋగ్వేద, యజుర్వేద విభాగాలలో చేసిన సేవలకు గాను ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్యారడైజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ పురస్కారం అందిన సందర్భంగా ఆయన తల్లిదండ్రులు, మిత్రులు, డాక్టర్ లంక ప్రసన్నకుమార్, బ్రాహ్మణ సంఘ పెద్దలు, తదితరులు అభినందించారు.

ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజ


ఉత్సవ విగ్రహాలను పూజకు తీసుకెళుతున్న గ్రామ పెద్దలు

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న పర్వత వర్ధినీసమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉత్సవ విగ్రహాలకు మంగళవారం స్థపన పూజను నిర్వహించారు. పంచ లోహాలతో తయారు చేయించిన ఉత్సవ విగ్రహాలను దేవతా హోమంలోని భస్మంతో శుభ్రపరిచారు. ఆలయం వద్ద ఉదయం గవ్యాంత పూజలు, మూల మంత్రహవనాలు, మూర్తులకు క్షీరాధివాసం, సాయంత్రం ధాన్యాదివాసం, అంగ ప్రత్యంగ దేవతా హోమం, శాలార్చన, చతుర్వేద పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. 12వ తేదీ సాయంత్రం సామూహిక కుంకుమార్చన, సర్వ దేవతా మూల మంత్ర హోమం, పుష్పాధివాసం, 13వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ నిర్మాణ కర్త భూపతిరాజు తిమ్మరాజు తెలిపారు. కార్యక్రమంలో భూపతిరాజు తిమ్మరాజు, పృధ్వీకుమారి దంపతులు, భూపతిరాజు హనుమంతురాజు, సుమ దంపతులు, భగాతి మోహన్, శీర్ల ఏసుబాబు, వేగేశ్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి బధిరుల టీ20 క్రికెట్ పోటీలు


భీమవరంలో క్రికెట్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో ఈనెల 12,13 తేదీల్లో నిర్వహించే 5వ రాష్ట్రస్థాయి మూగ చెముడు (బధిరులు) టీ20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి చెప్పారు. మంగళవారం డీఎన్నార్ కళాశాల వద్ద గన్నాబత్తులవారి క్రీడమైదానంలో క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కకకృష్ణంరాజు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 10 టీమ్స్‌తో క్రీడాకారులు, నాలుగు జోన్ జట్లుగా పోటీల్లో తలబడుతున్నారన్నారు. పోటీలను బుధవారం ఉదయం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రారంభిస్తారని భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య, డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో ఐసీడీఎస్ నియోజకవర్గ ప్రాజెక్టు అధికారి వాణీవిజయరత్నం, అంగన్‌వాడీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించాలని తెలిపారు. అలాగే కేంద్రాలకు అందుతున్న పోషక పదార్థాల నాణ్యతను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.